
సాక్షి
పల్నాడు
గురువారం। 14। మార్చి। 2024



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 514.00 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.



1,41,742 బస్తాల విక్రయం

కొరిటెపాడు(గుంటూరు): మార్కెట్ యార్డుకు బుధవారం 1,20,628 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,41,742 బస్తాలు అమ్మకాలు జరిగాయి.



వైఎస్సార్ సీపీ కార్యాలయం ప్రారంభం

పెనమలూరు: నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని బుధవారం గంగూరులో ఎంపీ అయోధ్య రామిరెడ్డి, మంత్రి జోగి రమేష్ ప్రారంభించారు.



న్యూస్‌రీల్

పోలింగ్ బూత్‌ల పరిశీలన



తాడేపల్లి రూరల్ : మండలంలో బుధవారం జాయింట్ కలెక్టర్ రాజకుమారి విస్తృతంగా పర్యటించారు. పెనుమాక, ఉండవల్లి, కుంచనపల్లి, ప్రాతూరు ప్రాంతాల్లో పలు పోలింగ్ బూత్‌లను పరిశీలించి మౌలిక సదుపాయాలు ఏ విధంగా ఉన్నాయనే విషయాన్ని ఆరాతీశారు. పోలింగ్ బూత్‌లలో తప్పని సరిగా ర్యాంప్‌లు ఏర్పాటు చేయాలని, విద్యుత్, మంచి నీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని తాడేపల్లి డెప్యూటీ తహసీల్దార్ సతీష్‌ను ఆదేశించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగే విధంగా ప్రణాళిక సిద్ధం చేయాలని చెప్పారు.

కస్తూర్బా గాంధీ విద్యాలయంలో ప్రవేశాలు

నరసరావుపేట ఈస్ట్: పెదచెరువులోని కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంలో 2024–25 విద్యా సంవత్సరానికి ప్రవేశాలు ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ ఎం.ప్రమీలారాణి బుధవారం తెలిపారు. విద్యాలయంలో 6వ తరగతి, ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ఎంపీసీ గ్రూప్‌లో ప్రవేశం కోసం ఈనెల 12వ తేదీ నుంచి ఏప్రిల్ 11వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని వివరించారు. ముస్లిం మైనార్టీలు, అనాథలు, బడిబయట, బడి మధ్యలో మానివేసిన బాలికలు, ఎస్సీ, ఎస్టీ బీసీ, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న బాలికలు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని తెలిపారు.

అమరేశ్వరుడుకి ఏకాంత సేవ



అమరావతి: బాలచాముండికా సమేత అమరేశ్వరుని మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల అనంతరం మూడురోజుల పాటు నిర్వహించే స్వామి వారి సేవల్లో భాగంగా బుధవారం రాత్రి శాస్త్రోక్తంగా ఏకాంతసేవ నిర్వహించారు. ఆలయ స్థానాచార్యుడు కౌశిక చంద్రశేఖర శర్మ నేతృత్వంలో ఉత్సవ మూర్తులను ఆలయంలో ద్వాదశ ప్రదక్షణలను నిర్వహించిన అనంతరం కుంభహారతి, నక్షత్ర హారతి, పంచహారతుల సేవ నిర్వహించారు. స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించిన ఊయలలో పవళింపజేసి, ఏకాంత సేవ పూర్తిజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో వేమూరి గోపీనాథశర్మ, సిబ్బంది, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

వినుకొండలో రోశయ్య విగ్రహావిష్కరణ



వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని నరసరావుపేట రోడ్డులో దివంగత మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి వెంకటరోశయ్య విగ్రహావిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు, వాసవీక్లబ్, వనితా క్లబ్, పలు వ్యాపార అసోసియేషన్ నాయకుల మధ్య రోశయ్య కాంస్య విగ్రహాన్ని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఆర్థికమంత్రిగా, తమిళనాడు గవర్నర్‌గా ఆంధ్రప్రదేశ్‌కు ఎనలేని సేవలు అందించిన రోశయ్యను మరువలేమని అన్నారు. పరిపాలన దక్షత కలిగిన రోశయ్య విగ్రహం వినుకొండలో ఆవిష్కరించడం తన అదృష్టంగా భావిస్తున్నానని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు, అభిమానులు, కార్యకర్తలు, వనితా క్లబ్, వాసవీక్లబ్ సభ్యులు, డాల్‌మిల్లర్స్, కిరాణా మర్చంట్ అసోసియేషన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అగ్రవర్ణ పేదలకు ఆపన్నహస్తం

- నేడు మూడో విడత నగదు జమ
- ఒక్కొక్కరి ఖాతాలో రూ.15 వేలు జమ చేయనున్న ప్రభుత్వం
- బనగానపల్లిలో బటన్ నొక్కనున్న సీఎం వైఎస్. జగన్
- పల్నాడు జిల్లాలో 33,368 మంది మహిళలకు రూ. 50.05 కోట్లు లబ్ధి
- ఇప్పటికే రెండు విడతల్లో మొత్తం 63,843 మందికి రూ.95.76 కోట్లు జమ
- సంక్షేమ పథకాల్లో ఆర్థికంగా వెనుకబడిన అగ్రవర్ణాలకు లబ్ధి కలిగిస్తున్న ప్రభుత్వం

సాక్షి, నరసరావుపేట: గతంలో ఏ ప్రభుత్వమూ అగ్రవర్ణ పేదల సంక్షేమ గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు. సంక్షేమ ఫలాలు కొన్ని వర్గాలకే పరిమితం చేశారు. దీంతో అగ్ర వర్గాలలో పుట్టినప్పటికి పేదరికంతో బాధపడేవార్ని ఏ ప్రభుత్వాలు ఆదుకోక, బయటకు చెప్పుకోలేక అనేక ఇబ్బందులు పడ్డారు. తన సుదీర్ఘ పాదయాత్రలో భాగంగా అన్ని వర్గాల కష్టాల్ని విని, చూసి ఇప్పటివరకు లేని సంక్షేమ పథకాల్ని రూపొందించారు ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి. ఇప్పటికే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం వివిధ పథకాల్ని అమలు చేస్తున్న విషయం తెలిసిందే. అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా సాగుతున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆర్థికంగా వెనకబడిన అగ్రవర్ణాల పేద మహిళలకు వైఎస్సార్ ఈబీసీ నేస్తం పేరిట ఆర్థిక భరోసా కల్పిస్తోంది. అందులో భాగంగా 45 – 60 ఏళ్లలోపు మహిళలకు 'ఈబీసీ నేస్తం' పథకం ద్వారా ఏడాదికి రూ.15వేల చొప్పున వరుసగా మూడేళ్లపాటు ఇవ్వనున్నారు. ఒక్కొక్కరికీ రూ.45 వేలు అందనుంది. ఇప్పటికే రెండు విడతల్లో రూ.30వేలను ప్రభుత్వం జమ చేసింది. నంద్యాల జిల్లా బనగానపల్లిలో రాష్ట్రస్థాయి ప్రారంభోత్సవ కార్యక్రమం జరగనుంది. అందులో సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొని నగదు జమను బటన్ నొక్కి ప్రారంభిస్తారు.

పల్నాడు జిల్లాలో ఈబీసీ నేస్తం అమలు తీరు		
విడత	లబ్ధిదారుల సంఖ్య	నగదు జమ రూ.కోట్లలో
తొలి రెండు విడతల్లో	63,843	95.76
మూడో విడత (నేడు)	33,368	50.05

పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్‌తో పాటు ప్రజాప్రతినిధులు, ఇతర ఉన్నతాధికారులు, ఎంపిక చేసిన లబ్ధిదారులు హాజరుకానున్నారు.

సచివాలయాల్లో జాబితాల ప్రదర్శన

రెడ్డి, కమ్మ, ఆర్య వైశ్య, బ్రాహ్మణ, క్షత్రియ, వెలమతో పాటూ మిగిలిన ఓసీ సామాజికవర్గానికి చెందిన మహిళలకు ఈబీసీ నేస్తం వర్తిస్తుంది. అగ్రవర్ణాలలోని కాపు సామాజిక వర్గానికి కాపు నేస్తం ద్వారా మహిళలకు సహాయపడుతున్న విషయం తెలిసిందే. ఈబీసీ నేస్తం ద్వారా పల్నాడు జిల్లాలో మూడో విడతకు 33,368 మంది అర్హత సాధించారు. మహిళల ఖాతాల్లో నేడు రూ.50,05,20,000 వారి బ్యాంకు ఖాతాల్లో జమకానున్నాయి. లబ్ధిదారుల వివరాలతో గ్రామ, వార్డు సచివాలయాల్లో జాబితాల్ని ప్రదర్శించారు. లబ్ధిదారుల వద్దకు వెళ్లి ఆర్థిక సాయంపై అధికారులు అవగాహన కల్పించారు. ఈ నగదును ఖర్చు చేసుకోవడానికి ఎటువంటి ఆంక్షలు లేవు. ఇప్పటికే రెండు విడతలో పల్నాడు జిల్లాలో 63,843 మందికి గాను రూ.95.76 కోట్లు జమ చేశారు.



రెండు విడతల్లో నగదు జమ

అగ్రవర్ణ పేదల గురించి ఆలోచించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఈబీసీ నేస్తాన్ని ప్రవేశపెట్టింది. నాకు ఇప్పటికే రెండు విడతల్లో రూ.30 జమ అయ్యింది. నేడు మరో విడతలో రూ.15 వేల జమకానుంది. ఇది అన్ని వర్గాలకు న్యాయం చేస్తున్న ప్రభుత్వం.

– అనుమలశెట్టి సీతామహాలక్ష్మి, చాగంటివారిపాలెం, ముప్పాళ్ల మండలం



కష్టాలను అర్థం చేసుకున్న ప్రభుత్వం

గతంలో ఏ ప్రభుత్వం కూడా అగ్రవర్ణ పేదల కష్టాల గురించి ఆలోచించలేదు. ప్రతి వర్గంలో పేద, ధనిక ఉంటారని గుర్తించి, వారి సంక్షేమం కోసం కృషి చేస్తున్న గొప్ప మనిషి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. ఆయనకు అన్ని వర్గాల పేదలకు అండగా నిలుస్తారు. మా సంక్షేమ కోసం పోరాడుతున్న ముఖ్యమంత్రికి మేము అండగా నిలుస్తాం.

– అంబటి అరుణ కుమారి, రెంటచింతల , మాచర్ల నియోజకవర్గం.



అర్హుల ఎంపికలో వివక్ష లేదు

వైఎస్సార్ ఈబీసీ నేస్తం పథకానికి అర్హుల ఎంపికలో ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం పార్టీలకు అతీతంగా, పారదర్శకంగా లబ్ధిదారుల్ని ఎంపిక చేశాం. సంక్షేమ ఫలాల్ని అందించడంలో ఎటువంటి వివక్షలకు తావు ఇవ్వడం లేదు. ఆర్థికంగా వెనుకబడిన అగ్రవర్ణాల మహిళలకు ప్రభుత్వం ఏడాదికి రూ.15వేలు చొప్పున మూడేళ్ల పాటు అందించనుంది. అన్ని వర్గాల పేదల్ని ఆదుకుంటోంది.

– డి. దుర్గాబాయి, బీసీ కార్పొరేషన్ ఈడీ

రౌడీషీటర్ దారుణహత్య

- పల్నాడు జిల్లా నకరికల్లు మండలం చల్లగుండ్ల వద్ద ఘటన
- మృతుడు రొంపిచర్ల మండలం విప్పర్ల వాసి

నకరికల్లు : రౌడీషీటర్ దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఘటన పల్నాడు జిల్లా నకరికల్లు మండలం చల్లగుండ్ల సమీపంలో బుధవారం రాత్రి జరిగింది. ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రొంపిచర్ల మండలం విప్పర్ల గ్రామానికి చెందిన పెరవల్లి మణికంఠ(27) నకరికల్లు మండలం చల్లగుండ్ల సమీపంలో అద్దంకి–నార్కట్‌పల్లి రాష్ట్ర రహదారి పక్కనే గల దాబాలోని గదిలో రాత్రి సుమారు 9:30 గంటల సమయంలో మద్యం తాగుతూ ఒంటరిగా కూర్చున్నాడు. ఈ సమయంలో అడ్డరోడ్డు వైపు నుంచి మూడు ద్విచక్ర వాహనాలపై మారణాయుధాలతో వచ్చిన ఆరుగురు గుర్తు తెలియని వ్యక్తులు నేరుగా మృతుడు ఉన్న గదిలోకి వెళ్లి దాడి చేశారు. కేకలు విన్న దాబా సమీపంలోని వారు గది వద్దకు వచ్చేసరికి ద్విచక్ర వాహనాలపై నకరికల్లు వైపు పరారయ్యారు. తీవ్రగాయాలపాలైన మణికంఠ అక్కడికక్కడే మృతిచెందాడు. సీఐ ఎం.రాంబాబు మాట్లాడుతూ మృతుడిపై రొంపిచర్ల పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీట్ నమోదైనట్లు తెలిపారు. మృతుడు పలు క్రిమినల్, చోరీ కేసుల్లోను, అలాగే ఓ అత్యాచారం, హత్యకేసులో నిందితుడిగా ఉన్నట్లు తెలిపారు. అక్రమసంబంధం నేపథ్యంలో హత్య జరిగినట్లు భావిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

సార్వత్రిక ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

కేంద్ర బలగాలతో జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి



బలగాలతో మాట్లాడుతున్న ఎస్పీ

నరసరావుపేట: సార్వత్రిక ఎన్నికల విధులకు సంసిద్ధంగా ఉండాలని కేంద్ర భద్రతా బలగాలకు జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి దిశా నిర్దేశం చేశారు. పట్టణంలోని ఎస్ఎస్ఎన్ కళాశాల ఆవరణలో బుధవారం శాంతిభద్రతల విధుల కోసం వచ్చిన 600మంది కేంద్ర సాయుధ బలగాల్ని ఆయన పరిశీలించారు. కళాశాలలో వారి కోసం ఏర్పాటు చేసిన మౌలిక వసతుల గురించి పాలకవర్గ అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, కేంద్ర బలగాల అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కేంద్ర బలగాల్ని ఉద్దేశించి మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల విధులు నిర్వహించేందుకు సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతల పరిరక్షణకు కోసం సమష్టిగా విధులు నిర్వహించి, ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కృషి చేద్దామని చెప్పారు. విధి నిర్వహణలో స్థానిక పోలీస్ అధికారులు, సిబ్బందితో సమన్వయం కలిగి సహకరించాలని ఆయన సూచించారు. కేటాయించిన కేంద్రాలు, గ్రామాల్లో అనుకోని సంఘటనలు ఎదురైతే వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేయాలని ఆదేశించారు. అత్యంత సమస్యాత్మక గ్రామాల్లో స్థానిక పోలీసులతో కలసి మార్చ్‌ఫాస్ట్ నిర్వహించాలని సూచించారు. పిడుగురాళ్ల, మాచర్ల, వినుకొండ, సత్తెనపల్లి టౌన్, అమరావతి, నరసరావుపేట తదితర ప్రాంతాల్లో సీఐఎస్ఎఫ్, బీఎస్ఎఫ్ బలగాలకు వసతి ఏర్పాటు చేశామని, అక్కడ నుంచి వారికి కేటాయించిన ప్రాంతాల్లో విధులు నిర్వహించాల్సి ఉంటుందని తెలిపారు. బీఎస్ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్స్ బరియాదేశ్ సింగ్, బన్సీధర్, ఏఆర్ డీఎస్పీ జీఎం. గాంధీ, సీఐ ప్రభాకర్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

సాహితీ లోకాన తొలి తెలుగు కవయిత్రి మొల్ల

- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- సత్తెనపల్లిలో ఘనంగా మొల్ల జయంతి వేడుకలు



పట్టణంలో మొల్ల విగ్రహం వద్ద మంత్రి అంబటి రాంబాబు, నాయకులు

సత్తెనపల్లి: సాహితీ లోకాన తొలి తెలుగు కవయిత్రిగా మొల్ల కీర్తి ప్రతిష్టలు సాధించారని, మహిళా లోకానికి ఆమె ఆదర్శమని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పట్టణంలోని 1వ వార్డులో మొల్ల జయంతిని పురస్కరించుకొని బీసీ (కుమ్మరి) సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన ఆమె జయంతి వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ముందుగా మొల్ల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ మొల్ల రామాయణం ప్రసిద్ధి చెందిందన్నారు. నేటి మహిళా రచయితలకు ఆమె స్ఫూర్తివంతమన్నారు. అనంతరం మంత్రి అంబటి రాంబాబును 1వ వార్డు కౌన్సిలర్ వరికల్లు కోటేశ్వరరావు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి రాజవరపు శివనాగేశ్వరరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబూరావు, సీపీఎం నాయకుడు కట్టా శివదుర్గారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు నిజాంపట్నం అమరేంద్ర, వరికల్లు కోటిలింగం, దరిపల్లి రామకోటయ్య, నామేపల్లి పూర్ణయ్య, గూడా శ్రీనివాసరెడ్డి, సాత్రాసు పల్లి మాణిక్యారావు, కాటుమాల డేవిడ్, బీసీ సంఘాల నాయకులు, పలువురు కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ అనుబంధ సంఘాల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

శింగరకొండ హుండీ ఆదాయం లెక్కింపు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దేవస్థాన సిబ్బంది

అద్దంకి రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శింగరకొండ ప్రసన్నాంజనేయ దేవస్థానంలోని కానుకల హుండీని బుధవారం ఏసీ సుభద్ర ఆధ్వర్యంలో లెక్కించారు. 13 డిసెంబర్ 23 నుంచి 13 మార్చి 2024 మధ్య కాలంలో వచ్చిన హుండీలోని కానుకలను లెక్కించగా రూ.21.66 లక్షల నగదు, యుఎస్ఏ డాలర్స్ 15, ఇంగ్లాండ్ పౌండ్స్ 120 వచ్చాయి. కార్యక్రమానికి జె. పంగులూరు గ్రూపు దేవస్థానాల ఈవో యు. శ్రీనివాసరావు పర్యవేక్షణాధికారిగా హాజరయ్యారు.

వంట సామగ్రికి అద్దంకి ఎస్‌బీఐ శాఖ 10 లక్షల విరాళం

ప్రముఖ పుణ్యక్షేత్రమైన శింగరకొండ దేవస్థానంలో నిత్యాన్నదానానికి అవసరమైన వంట సామగ్రి, బాయిలర్స్ మొదలైన పరికరాలకు ఎస్‌బీఐ అద్దంకి శాఖ రూ.10 లక్షల విలువ గల వర్క్ ఆర్డర్‌లు ఇచ్చిన పత్రాన్ని బుధవారం దేవస్థాన ఏసీ సుభద్రకు బ్యాంకు మేనేజర్ జె. దివాకర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

సు'స్త్రీ'ర ఆర్థికాభివృద్ధికి చేయూత

- పేద కుటుంబాల్లో మహిళలకు ఆర్థిక చేయూత
- ఏటా ఒక్కో మహిళకు రూ. 18,750 సాయం
- జిల్లాలో నాలుగు విడతల్లో 3,26,424 మందికి రూ.612.03 కోట్ల లబ్ధి
- జిల్లాలో అత్యధికంగా పెదకూరపాడు నియోజకవర్గంలో 53,449 మహిళలకు రూ.100.22 కోట్ల లబ్ధి



సత్తెనపల్లి 3వ వార్డులో చీరలు వ్యాపారం చేస్తున్న జానకీబాయి

సత్తెనపల్లి: ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ చేయూత పథకం మహిళల ఎదుగుదలకు, ఆర్థికాభివృద్ధికి అండగా నిలుస్తోంది. అర్హులైన లబ్ధిదారులకు ఏడాదికి రూ. 18,750 అందజేస్తూ, స్వశక్తిపై ఎదిగేలా చేయూతనిస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మహిళల సమగ్రాభివృద్ధి, ఆర్థిక సాధికారతలో భాగంగా వైఎస్సార్ చేయూత పథకాన్ని 2020 ఆగస్టు 12న రూపొందించింది. 45 నుంచి 60 ఏళ్లున్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల మహిళలకు నాలుగు విడతల్లో రూ. 75వేల ఆర్థిక సాయం అందించే ప్రత్యేక సంక్షేమ కార్యక్రమం ఇది. కుటుంబ స్థాయిలో మెరుగైన జీవనోపాధిని అందిపుచ్చుకునేలా అవకాశాలు కల్పించడం, సంపద సృష్టి, ఆదాయాభివృద్ధి కార్యక్రమాల ద్వారా సుస్థిర జీవనోపాధి కల్పించడమే ఈ పథకం లక్ష్యం.

టీడీపీ హయాంలో మొండిచేయి

టీడీపీ ప్రభుత్వ హయాంలో మహిళా సంక్షేమానికి ఒక్క పథకం సరైంది లేదు. ఉమ్మడి రాష్ట్రానికి తొమ్మిదేళ్లు, విభజన రాష్ట్రానికి ఐదేళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు తమ కోసం అమలు చేసిన పథకం ఒక్కటి కూడా లేదని మహిళలు పెదవి విరుస్తున్నారు. బ్యాంకులు లింకేజీ రుణాలు ఇవ్వడం, వారి సంక్షేమానికి ప్రత్యేకంగా అమలు చేసింది శూన్యమే. 2014 ఎన్నికల సమయంలో డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని, ఎవ్వరూ బ్యాంకు రుణాలు చెల్లించ వద్దంటూ, అధికారంలోకి వచ్చాక చంద్రబాబు తమను మోసం చేశారని మహిళలు మండిపడుతున్నారు. మళ్లీ ఎన్నికలు సమీపిస్తుండడంతో కొత్త వాగ్దానాలతో ముందుకు వస్తున్న ఆయన్ను నమ్మే స్థితిలో లేమని వారు ఘంటాపథంగా చెబుతున్నారు.

చేయూత నిధులతో వ్యాపారాలు

వైఎస్సార్ చేయూత పథకం కింద ప్రభుత్వం రిటైల్ వస్త్ర వ్యాపారంలో గుర్తింపు పొందిన లబ్ధిదారులకు మద్దతు ఇచ్చేందుకు బహుళ జాతి కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకుంది. పాడి రైతులకు పశువుల పెంపకం, పాల సేకరణ, కిరాణా షాపులు, వస్త్ర దుకాణాల ఏర్పాటు, పండ్లు, కూరగాయలు వంటివి కొనుగోలు కోసం ఆర్థిక సహాయం చేస్తోంది. జీవనోపాధి తరహా వ్యాపారాలు నడిపేందుకు అవకాశం కల్పించింది. జిల్లాలో నాలుగు విడతల్లో ఈ పథకం ద్వారా 3,26,424 మంది మహిళలకు రూ. 612.03 కోట్ల సహాయం అందించింది. జిల్లాలోనే అత్యధికంగా పెదకూరపాడు నియోజకవర్గంలో 53,449 మంది మహిళలకు నాలుగు విడతల్లో రూ. 100.22 కోట్ల లబ్ధి చేకూరింది.

జిల్లాలో నాలుగు విడతల్లో లబ్ధి పొందిన వారి వివరాలు...

నియోజకవర్గం	లబ్ధిదారులు	నిధులు (రూ. కోట్లలో)
చిలకలూరిపేట	43,800	82.13
గురజాల	50,393	94.49
మాచర్ల	51,806	97.14
నరసరావుపేట	33,960	63.68
పెదకూరపాడు	53,449	100.22
సత్తెనపల్లి	48,601	91.12
వినుకొండ	44,415	83.28
మొత్తం	3,26,424	612.03

కష్టాలు తప్పాయి

వైఎస్సార్ చేయూత పథకం ద్వారా ఏటా రూ. 18,750ను ప్రభుత్వం బ్యాంక్ ఖాతాలో జమ చేసింది. నాలుగు విడతలుగా రూ.75 వేలు చేతికి అందాయి. ఈ మొత్తానికి మరి కొంత వేసుకుని చీరలు వ్యాపారం ప్రారంభించా. ప్రస్తుతం వ్యాపారం బాగా సాగుతూ ఉండడంతో కష్టాలు తొలగిపోయాయి. కుటుంబ పోషణకు ఇబ్బందులు తప్పాయి. ఇచ్చిన మాట సీఎం వైఎస్. జగన్‌మోహన్ రెడ్డి తప్పడు అనేందుకు నేనే నిదర్శనం.

– కె.జానకీబాయి, శ్రీ వర్ష మహిళా పొదుపు సంఘం, సత్తెనపల్లి.

మాట నిలబెట్టుకున్న జగన్



ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్‌రెడ్డి 45 ఏళ్ల పైబడిన మహిళలకు ఏటా రూ. 18,750 ఇస్తామని చెప్పి మాట నిలబెట్టుకున్నారు. కరోనా సమయంలో సైతం చేయూత నిధులు నా బ్యాంక్ అకౌంట్‌లో జమ చేశారు. నాలుగు విడతలుగా ఖాతాలో రూ.75 వేలు జమ చేశారు. నేను వ్యాపారం చేసుకుంటూ జీవనోపాధి వెళ్లదీస్తున్నా. ప్రజాసంకల్ప పాదయాత్రలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేసి ప్రజల హృదయాల్లో జగన్‌మోహన్‌రెడ్డి చెరగని ముద్ర వేసుకున్నారు.

–బొమ్మ నాగమణి, జనప్రియ మహిళా పొదుపు సంఘం, సత్తెనపల్లి.

అంతర్ జిల్లాల మహిళా దొంగల అరెస్టు

- రద్దీగా ఉండే ప్రాంతాలే టార్గెట్
- రూ.10.60 లక్షల సొత్తు స్వాధీనం
- కేసు వివరాలు వెల్లడించిన వన్‌టౌన్ సీఐ కృష్ణారెడ్డి



కేసు వివరాలను వెల్లడిస్తున్న సీఐ కృష్ణారెడ్డి, పక్కన నిందితులు, సిబ్బంది

నరసరావుపేట టౌన్: రద్దీగా ఉండే ప్రాంతాల్ని లక్ష్యంగా చేసుకొని చోరీలకు పాల్పడుతున్న అంతర్ జిల్లాల మహిళా దొంగల్ని అరెస్టు చేసి వారి నుంచి రూ.10.60 లక్షల విలువైన 211 గ్రాముల బంగారు ఆభరణాల్ని స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ సీహెచ్. కృష్ణారెడ్డి తెలిపారు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో కేసు వివరాల్ని వెల్లడించారు.

హైదరాబాద్ గచ్చిబౌలి ప్రాంతానికి చెందిన ఇట్లాపురం షెహనాజ్ ఈ నెల 7న స్వగ్రామమైన చిలకలూరిపేటకు వచ్చింది. అక్కడ నుంచి వినుకొండలోని బంధువుల ఇంటికి వెళ్లేందుకు నరసరావుపేట బస్టాండ్‌లో దిగి బస్సు మారుతుండగా ఆమె బ్యాగ్‌లో బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయి. ఈ మేరకు బాధితురాలిచ్చిన ఫిర్యాదుతో వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పల్నాడు ఎస్పీ వై. రవిశంకర్ రెడ్డి చోరీ కేసును ఛేదించేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ ఆధ్వర్యంలో సీఐ కృష్ణారెడ్డి బస్టాండ్‌లో లభ్యమైన సీసీ ఫుటేజ్ ఆధారంగా ఇద్దరు మహిళల్ని అనుమానితులుగా భావించారు. ఇద్దరు పాత నేరస్తుల ముఖకవళికలు కలిగి ఉండటాన్ని గుర్తించి బాపట్ల జిల్లా ఈపూరు పాలెం గ్రామానికి చెందిన కంజు లక్ష్మి, గుంటూరు నల్లచెరువుకు చెందిన చిరుమామిళ్ల యశోదలను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తమదైన శైలిలో విచారించగా బస్టాండ్‌లో చోరీకి గురైన 213 గ్రాముల బంగారు ఆభరణాల్ని అప్పగించారు. నిందితుల్లో లక్ష్మీపై బాపట్ల, ప్రకాశం, పాత గుంటూరు జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్‌లో పది కేసులు ఉన్నట్లు సీఐ తెలిపారు. యశోదపై మూడు చోరీ కేసులు ఉన్నట్లు పేర్కొన్నారు. ఇద్దరినీ కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు.

ఇంటర్ పరీక్షల్లో ఒకరు డిబారు

నరసరావుపేట ఈస్ట్: ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సర పరీక్షల్లో బుధవారం ఒక విద్యార్థి డిబార్ అయ్యారు. కారంపూడిలోని బీబీజేసీ జూనియర్ కళాశాలలో అర్థశాస్త్రం-2 పరీక్షలో మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడుతూ విద్యార్థి పట్టుబడినట్లు ప్రత్యేక అధికారి శేఖరబాబు తెలిపారు. జిల్లా పరిధిలో పరీక్షలకు 14,102 మంది విద్యార్థులకు గాను 13,546 మంది హాజరు కాగా 548 మంది గైర్హాజరయ్యారని వివరించారు. జనరల్ విద్యార్థులు 13,479 మందికి గాను 12,972 మంది, ఒకేషనల్ విద్యార్థులు 623 మందికిగాను 574 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు.

గ్రామ సచివాలయంతో ప్రజల చెంతకే సేవలు

భవనం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే

విజయపురిసౌత్: ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువ చేయాలన్న ఆలోచనతో సీఎం వైఎస్ జగన్ గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం మాచర్ల మండలం కొత్తూరు గ్రామంలో రూ.43.80 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. సచివాలయ వ్యవస్థతో గ్రామస్థాయిలోనే ప్రజలకు ప్రభుత్వ సేవలు, పథకాలు సకాలంలో అందుతున్నాయన్నారు. అన్ని వర్గాలకు సమన్యాయం చేసిన జగనన్నతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకునేందుకు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని పిన్నెల్లి పిలుపునిచ్చారు. అనంతరం సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. అలాగే కొత్తూరు గ్రామం నుంచి ఏడో మైలు గ్రామం వరకు రూ.30 లక్షల వ్యయంతో రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఏడో మైలులో నూతనంగా ఏర్పాటుచేసిన తాగునీటి బోరును ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో మాచర్ల వైఎస్సార్ సీపీ నేత బూడిద శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పెద్ద మల్లుస్వామి, వైస్ ఎంపీపీ పోతిరెడ్డి సుజాత, కొత్తూరు సర్పంచ్ మద్దిగపు అచ్చిరెడ్డి, పశువేముల సర్పంచ్ దేవదానం, ఏకోనాం పేట సర్పంచ్ రమావత్ సుచియానాయక్, ఎంపీటీసీ వడితే మంగ్యాబాయి, మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు బ్రహ్మం నాయక్, మాజీ సర్పంచ్ మూఢావత్ తావుర్యా, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

విలేజ్ క్లినిక్‌కు ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్ల విరాళం



ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లను అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

నకరికల్లు: గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమని హైదరాబాద్‌కు చెందిన మిడ్‌వెస్ట్ గ్రానైట్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధులు కోడె శ్రీనివాస్, ఉన్నం రవి, మస్తాన్ అన్నారు. చేజర్ల గ్రామంలోని వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌కు ఆక్సిజన్ తయారీ పరికరాలు రెండింటిని మిడ్‌వెస్ట్ సంస్థ తరపున బుధవారం బహూకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సర్పంచ్ బొడ్లపాటి కృష్ణకుమారి అభ్యర్థన మేరకు ఆక్సిజన్ కాన్సన్ ట్రేటర్లు అందించామని తెలిపారు. రూ.1,80,000ల ఖరీదైన ఆక్సిజన్ పరికరాలు ఒక్కొటి.. 20 లీటర్ల సామర్థ్యం కలిగిన ఆక్సిజన్ తయారు చేస్తాయన్నారు. వైఎస్సార్ విలేజ్ క్లీనిక్‌లో అవి అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌ఓ వెంకటరెడ్డి, ఏఎన్‌ఎం కుమారి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు జిల్లా స్థాయి రెజ్లింగ్ ఎంపికలు

నరసరావుపేట ఈస్ట్: పల్నాడు జిల్లా అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం అండర్-20 విభాగంలో జిల్లా స్థాయి మహిళా, పురుషుల ఎంపికలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి గుడిపూడి భూషణం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సత్తెనపల్లి రోడ్డులోని డీఎస్‌ఏ స్టేడియంలో సాయంత్రం 3 గంటలకు పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. క్రీడాకారులు తమ ఆధార్ కార్డు ఒరిజినల్, జెరాక్స్ కాపీలు, ఫిజికల్ ఫిట్‌నెస్‌తో హాజరు కావాలని, వివరాలకు 83094 26350, 91219 72179 నంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

కవయిత్రి మొల్ల చూపిన మార్గం ఆదర్శనీయం

- జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి
- ఘన నివాళులర్పించిన అధికారులు

నరసరావుపేట: తొలి మహిళా కవయిత్రి మొల్ల చూపిన మార్గం ఆధునిక మహిళలకు ఆదర్శనీయమని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని స్పందన హాలులో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కవయిత్రి మొల్ల జయంతి కార్యక్రమం నిర్వహించారు. మొల్ల చిత్రపటానికి పూలమాలు వేసి, ఘన నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. తాను మొల్ల రామాయణంలో బాల కాండ చదివానని, ప్రభంద కాలంలో కవిత్వం వర్ణనతో కూడి ఉండేదన్నారు. ప్రతి తరగతి పాఠ్యాంశంలో కవయిత్రి మొల్ల గురించి ఉండాలని అభిప్రాయపడ్డారు. శాలివాహన సంఘం జిల్లా అధ్యక్షులు అంజయ్య, ట్రైనీ కలెక్టర్ కేఆర్ కల్పశ్రీ, బీసీ వెల్ఫేర్ అధికారి వెంకటేశ్వర్లు, దొంతు రంగయ్య పాల్గొన్నారు.



మొల్ల చిత్రపటానికి నివాళులర్పించిన కలెక్టర్ శివశంకర్



మొల్లమాంబ చిత్రపటానికి ఎస్పీ రవిశంకర్‌రెడ్డి, అదనపు ఎస్పీ రాఘవేంద్ర నివాళి

కవయిత్రి మొల్లమాంబకు ఎస్పీ ఘన నివాళి

నరసరావుపేట: ఆనాటి సమాజంలో స్త్రీల పట్ల ఉన్న వివక్షను చేధించి, వెలుగు చూసిన నారీమణి కవయిత్రి మొల్లమాంబ అని జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో తొలి తెలుగు కవయిత్రి, రామాయణ మహాగ్రంథ తెలుగు అనువాది మొల్లమాంబ జయంతి నిర్వహించారు. ఎస్పీ, పోలీసు అధికారులు ఆమె చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి మాట్లాడారు. మొల్ల చివరి శ్వాస వరకు తన రచనలతో సమాజ అభ్యుదయానికి పాటుపడిందన్నారు. సంస్కృతంలో ఉన్న వాల్మీకి రామాయణాన్ని తెలుగులోకి 'మొల్ల రామాయణం'గా అనువదించారని, విద్యాలయాల్లో పాఠ్యాంశం మైందని ఎస్పీ కొనియాడారు. ఆమె ఆశయ సాధన కోసం కృషి చేయాలని కోరారు. అదనపు ఎస్పీ (అడ్మిన్) ఆర్. రాఘవేంద్ర, ఏఆర్ అదనపు ఎస్పీ డి.రామచంద్ర రాజు, ఏఆర్ డీఎస్పీ గాంధీ, డీపీవో ఏఓ రామారావు, ఎస్‌బీ సీఐలు ప్రభాకర్, ఆర్‌ఐలు, సీఐలు పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శిగా రవిబాబు



సత్తెనపల్లి: వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా నూతన ప్రధాన కార్యదర్శిగా గంజిమాల రవిబాబు ఎన్నికయ్యారు. సత్తెనపల్లిలోని పుతుంబాక భవన్‌లో బుధవారం జరిగిన ఆ సంఘం విస్తృతస్థాయి సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. సంఘం అధ్యక్షుడు కారుచోల రోశయ్య అధ్యక్షత వహించిన సమావేశంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వంకాయలపాటి శివనాగరాణి పాల్గొని, మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా గురువారం దేశవ్యాప్తంగా సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతున్నట్లు తెలిపారు. నూతన ప్రధాన కార్యదర్శి జి.రవిబాబు మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో అత్యధికంగా ఉన్న మహిళా కూలీలను సంఘటిత పరచాలన్నారు. మాజీ కార్యదర్శి అనుముల లక్ష్మీశ్వరరెడ్డి, నాయకులు నాగేశ్వరరావు, భగత్, అప్పారావు, నాగేశ్వర రావు, పేతురు, వెంకటేశ్వర్లు, షేక్ ముస్తఫా, బాలకోటయ్య, తౌరటి రాము తదితరులు పాల్గొన్నారు.

'యువజన సంక్షేమ సంఘం' రాష్ట్ర అధ్యక్షుడిగా బత్తుల ఎన్నిక



నరసరావుపేట: ఏపీ వెనుకబడిన తరగతుల యువజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా బత్తుల వెంకటేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం రావిపాడు రోడ్డులోని కార్యాలయంలో సంఘ వ్యవస్థాపక సభ్యుల సమావేశం జరిగింది. వ్యవస్థాపక సభ్యులు పానుగోడు ఆంజనేయులు, పల్లపు విజయ్‌కుమార్, అన్నంగి ముత్యాలరావు, చిండా నాగేశ్వరరావు, షేక్ ఖాదర్ మస్తాన్, రావూరి కోటేశ్వరరావు, వేమవరపు శ్రీనివాసరావు, ఉడతా శ్రీనివాసరావు, ఆంజనేయులు, బొందిలే శ్రీనివాస్ సింగ్ పాల్గొన్నారు. బత్తుల వెంకటేష్‌ను సత్కరించి, అభినందనలు తెలిపారు.

నేడు నవోదయం కార్యక్రమం రద్దు

నరసరావుపేట: ప్రతి నెలా 14వ తేదీన కలెక్టరేట్‌లో నిర్వహించే నవోదయం కార్యక్రమాన్ని గురువారం రద్దు చేసినట్లు నోడల్ అధికారి కె.సంజీవరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులు ఈ విషయాన్ని గమనించాలని తెలిపారు.

జాతీయ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు జిల్లా ప్రాజెక్ట్‌లు



నరసరావుపేట ఈస్ట్: రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ వైజ్ఞానిక ప్రదర్శనలో పల్నాడు జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. ఈ నెల 11 నుంచి బుధవారం వరకు చిత్తూరు జిల్లా పలమనేరులోని మదర్ థెరిస్సా ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ప్రదర్శనలో జిల్లాకు చెందిన రెండు ప్రాజెక్ట్‌లు జాతీయ స్థాయి ప్రదర్శనకు ఎంపికైనట్లు జిల్లా సైన్స్ ఆఫీసర్ ఎ.ఎ.మధుకుమార్ బుధవారం తెలిపారు. రాష్ట్రం నుంచి 240మంది విద్యార్థులు ప్రదర్శనలో పాల్గొనగా 24 మంది ప్రాజెక్ట్‌లు జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. ఇందులో యడ్లపాడు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన షేక్.జమీర్ మ్యాన్ హోల్‌ను శుభ్రపరిచే ఆధునిక యంత్రం, క్రోసూరు జై భారత్ స్కూల్ విద్యార్థి షేక్. రేయాన్ సౌరశక్తితో ఇంధనం లేకుండా కలుపు మొక్కలను నివారించే యంత్రం ఉన్నట్లు తెలిపారు. వీరి గైడ్ టీచర్లు జి.రాధ, షేక్.ఖాదీర్ సహకారమందించారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులు చిత్తూరు జిల్లా విద్యాశాఖాధికారి దేవరాజ్, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ రీసెర్చ్ సైంటిస్ట్ డాక్టర్ కె.మహిమ చేతుల మీదుగా బహుమతులు అందుకున్నట్లు చెప్పారు.

మేదర్లు ఐక్యంగా ఉండాలి

కమ్యూనిటీ హాలు ప్రారంభోత్సవంలో మంత్రి అంబటి రాంబాబు



కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: మేదర సంఘం నిర్మించిన కమ్యూనిటీ హాలు అందరికీ ఉపయోగపడేలా ఉండాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ఆకాంక్షించారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ వద్ద ఉన్న మేదర సంఘానికి చెందిన.. శ్రీరామ మందిరం పైన నూతనంగా నిర్మించిన శ్రీ సీతారామ కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మంత్రి అంబటి రాంబాబు మాట్లాడారు. మేదర్లు ఐక్యంగా ఉండి కమ్యూనిటీ హాల్‌ను వినియోగించుకోవాలన్నారు. అనంతరం మంత్రి అంబటి రాంబాబును తుమ్మల నాగప్రసాద్ బాబు, మేదర సంఘం పట్టణ అధ్యక్షుడు జోరిగే కోటేశ్వరరావు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, మున్సిపల్ కౌన్సిలర్లు శివప్రసాద్, రవికుమార్, మునిసిపల్ కో-ఆప్షన్ సభ్యురాలు తుమ్మల లక్ష్మీ సుజాత, నాయకులు శ్రీనివాసరావు, నరసింహారావు, మేదర సంఘం నాయకులు తుమ్మల వెంకటేశ్వరరావు, సుధాకర్‌రావు, రాంబాబు, సోమయ్య, శ్రీనివాసరావు, శ్రీపతి, మోహన్ కృష్ణ, తుమ్మల శ్యాం కుమార్, చందా కృష్ణ స్వామి, చందా శేషగిరిరావు పాల్గొన్నారు.

భావితరాలకు గాంధీ ఆదర్శం

కాంస్య విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



మహాత్మా గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల: భావి తరాలకు ఆదర్శనీయుడు జాతిపిత మహాత్మా గాంధీ అని స్థానిక ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఆర్ అండ్ బీ బంగ్లా వద్ద ఏర్పాటు చేసిన మహాత్మా గాంధీ కాంస్య విగ్రహాన్ని ఆయన బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య నాయకులు ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ చింతా వెంకట రామారావు అధ్యక్షత వహించారు. అనంతరం ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మాట్లాడారు. భారత దేశానికి స్వాతంత్ర్యం సాధించిన జాతిపిత మహాత్మా గాంధీజీ విగ్రహాన్ని ఆవిష్కరించడం తన అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. అంతటి గొప్పవ్యక్తి గురించి ఎంత మాట్లాడినా తక్కువేనన్నారు. పిడుగురాళ్ల పట్టణంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రధాన రోడ్లను విశాలంగా విస్తరించినట్లు తెలిపారు. బైపాస్ రోడ్డు నిర్మాణం పూర్తిచేశామని, శుక్రవారం నుంచి వాహనాల రాకపోకలు జరుగుతాయన్నారు. 2025 జూన్ నుంచి వైద్య విద్య కళాశాల ప్రారంభమవుతుందని తెలిపారు. నర్సింగ్ కాలేజీ మంజూరు అయ్యిందని, త్వరలో ఇంజినీర్, డిగ్రీ కళాశాలలను కూడా తీసుకొచ్చి విద్య హబ్‌గా పిడుగురాళ్ల పట్టణాన్ని మారుస్తానని ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, నరసరావుపేట పార్లమెంట్ పరిశీలకులు రేపాల శ్రీనివాసరావు, మాజీ చైర్మన్ భవనాశి ఎల్లారావు, మున్సిపల్ వైస్ చైర్మన్లు ముక్కంటి, జైలాబ్దిన్, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు ఎండీ గఫార్, నాయకులు రామకృష్ణ, హనుమంతరావు, శ్రీనివాసరావు, పూర్ణచంద్రారావు, రామారావు, మున్సిపల్ కౌన్సిలర్లు, మార్కెట్ యార్డు డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

అక్కచెల్లెమ్మల ఆర్థిక పరిపుష్టికి సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



మహిళలకు రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే శంకరరావు

అమరావతి: చంద్రబాబు మాయ మాటలతో అక్కచెల్లెమ్మలను మోసం చేస్తే, జగనన్న పాలనలో మహిళలందరూ ఆర్థికంగా నిలదొక్కుకున్నారని పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. బుధవారం దిడుగు జగనన్న కాలనీలో 70 మంది మహిళలకు ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. అక్కచెల్లెమ్మలకు ఇచ్చిన మాట నిలబెట్టుకుని సీఎం వైఎస్ జగన్ సరికొత్త చరిత్ర సృష్టించారన్నారు. గత ప్రభుత్వాల హయాంలో ఇచ్చిన ఇళ్ల స్థలాలకు ఇప్పటికీ రిజిస్ట్రేషన్ లేదని పేర్కొన్నారు. కానీ జగనన్న ఆస్తి ఇచ్చి.. దానిపై సర్వ హక్కులు ఇచ్చారన్నారు. దీంతో సుమారు రూ.10 లక్షల విలువైన ఆస్తి దక్కుతోందని చెప్పారు. ముఖ్యంగా 40 ఏళ్ల క్రితం ఇచ్చిన ఇళ్ల స్థలాలకు నేటికీ కరెంటు, మంచినీరు, రోడ్లు వంటి వసతులు లేవని, కానీ జగనన్న కాలనీల్లో అన్ని వసతులను రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందని ఆయన వివరించారు. ఎన్నికల తర్వాత జగనన్న కాలనీల్లో సిమెంట్ రోడ్లు వేయనున్నట్లు వెల్లడించారు. 2019-24 మధ్యలో ఏం చేశామో వివరించి, ఓట్లు అడిగే ధైర్యం తమ ప్రభుత్వానికి ఉందని.. 2014-19 మధ్య ఏం చేశారో చెప్పి.. ఓట్లడిగే ధైర్యం చంద్రబాబుకు ఉందా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో జీడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ హరిబాబు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావు, సర్పంచ్ వింతాశ్రీలక్ష్మి, పార్టీ నాయకులు నంబూరు బాబురావు, బ్రహ్మారెడ్డి, రోశయ్య పాల్గొన్నారు.

'ఏపీ బ్రాహ్మణ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ' బ్రాంచ్ ప్రారంభం



శాఖ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: రాష్ట్ర ప్రభుత్వం బ్రాహ్మణుల కోసం నరసరావుపేటలో ఏర్పాటు చేసిన ఏపీ బ్రాహ్మణ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ పల్నాడు శాఖను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని ప్రకాష్ నగర్‌లో ఏర్పాటు చేసిన శాఖ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. 17వ బ్రాంచ్ నరసరావుపేటలో ప్రారంభించటం చాలా సంతోషకరమని ఎమ్మెల్యే గోపిరెడ్డి ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమానికి బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పేరి కామేశ్వర శర్మ, సొసైటీ చైర్మన్ అమ్మప్రసాద్, సీఈవో గుల్లపల్లి నాగసాయి, బ్రాహ్మణ కార్పొరేషన్ సంస్థ జనరల్ మేనేజర్ అన్నాప్రగఢ కుమారస్వామి, స్థానిక బ్రాహ్మణ సంఘాల నాయకులు కొప్పరపు పురుషోత్తమరావు, రొంపిచర్ల ఆంజనేయులు, అరిపిరాల ఫణి, సాగి శివకృష్ణ, గుడిపల్లి పవన్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. స్థానిక శాఖ మేనేజర్ కేసనపల్లి రామకోటేశ్వరరావు మాట్లాడుతూ మెంబర్ షిప్ కేవలం రూ.600లు మాత్రమేనని తెలిపారు.

టీడీపీ కూటమిని చిత్తుగా ఓడిస్తాం

శావల్యాపురం: ముద్రగడ్డ పద్మనాభం అండతో టీడీపీ కూటమిని చిత్తుగా ఓడిస్తామని రాష్ట్ర కాపు యువసేన అధ్యక్షుడు కర్ణా శ్రీనివాసరావు అన్నారు. బుధవారం పల్నాడు జిల్లా శావల్యాపురం మండలం గంటావారిపాలెంలోని ఆయన స్వగృహంలో విలేకర్లతో మాట్లాడారు. కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం వైఎస్సార్ సీపీలో చేరుతున్న నేపథ్యంలో కిర్లంపూడిలోని ఆయన నివాసానికి కాపు యువసేన నాయకులు వెళ్లి.. మద్దతు తెలిపినట్లు చెప్పారు. సమావేశంలో కాపు యువసేన గౌరవ అధ్యక్షుడు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ బత్తుల నాగసాయిరామ్, గోపి నాయుడు, శ్రీనివాసరావు, రవికుమార్ వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.